ప్రతి ఇంటికీ సంక్షేమమే లక్ష్యం

● ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో కేవలం ఆ పార్టీకి చెందిన వారికే మేలు జరిగిందని, అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. శుక్రవారం అమీన్‌పల్లి, గుండాల గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఆయా గ్రామాల ఇంచార్జ్ లాయర్ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని తెలియజేశారు. గ్రామస్తులు తన దృష్టికి చిన్న చిన్న సమస్యలను దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పల్లికి సరైన రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడేవారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీటీ రోడ్డు నిర్మించామని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌కు అందరం మద్దతు ప్రకటించి మరోసారి సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతకముందు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ.మాధవి, వైస్ ఎంపీపీ ప్రభావతి, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, మండల కన్వీనర్ బీ.మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌రెడ్డి, కృష్ణమూర్తి, చెన్నయ్య, స్టోర్ గోపాల్, చలపతినాయుడు, మాజీ సర్పంచ్ బాషా, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, మండల సచివాలయ కన్వీనర్ ఎన్.గోవింద్‌నాయక్, ఎంపీటీసీ చిన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిద్దె తండా వాసుల ఆందోళన


మిద్దెతండా వాసులను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

గుత్తి: భామ్లానాయక్ అలియాస్ పాములా నాయక్‌పై అక్రమంగా పీడీ యాక్ట్ నమోదు చేసిన గుత్తి సెబ్ సీఐ వరలక్ష్మిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మిద్దెతండా వాసులు, పాములా నాయక్ కుటుంబ సభ్యులు, బంధువులు గుత్తిలో ఆందోళన చేపట్టారు. మిద్దె తండాకు చెందిన పాములా నాయక్‌పై గురువారం పీడీ యాక్ట్ నమోదు చేసిన విషయం తెలిసిదే. సివిల్ పోలీసులు ఆందోళనకారులు సుమారు 20 మందిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు.

పుస్తక పరిచయంపై ప్రత్యేక సమావేశం

తాడిపత్రి టౌన్: స్థానిక టీచర్స్‌కాలనీలోని పెన్షనర్ భవనంలో ఆదివారం ఉదయం 8 గంటలకు విశ్రాంత అధ్యాపకుడు, కవి, రచయిత నందవరం కేశవరెడ్డి రచించిన కాంతిపూలు పుస్తక పరిచయంపై ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది రమేష్‌నాథరెడ్డి హాజరవుతారని, పెన్షనర్లు పాల్గొనాలని కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి రవికుమార్‌నాయుడు

తాడిపత్రి టౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి రవికుమార్‌నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు వీరారెడ్డి సూచించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కథల పుస్తకాలు, మహానుభావుల జీవిత చరిత్రలు, సైన్స్, క్విజ్, పురాణాలు వాటి విశిష్టతను తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్ప సంపద అద్భుతం


శిల్ప సంపదను తిలకిస్తున్న ఏపీ స్టేట్ సీఐడీ అధికారిణి ఝూన్సీలక్ష్మి

తాడిపత్రి టౌన్: 650 సంవత్సరాల ప్రాచీన చింతల వెంకటరమణస్వామి ఆలయంలో శిల్ప సంపద అద్భుతమని స్పెషల్ పీపీ, ఏపీ స్టేట్ సీఐడీ అధికారిణి ఝూన్సీలక్ష్మి కొనియాడారు. స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని శుక్రవారం ఆమెసందర్శించారు. చింతల వెంకటరమణస్వామి, ఆనందవల్లి అమ్మవార్లకు ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శిల్ప సంపదను ఆమె తిలకించారు. రామాయణానికి సంబంధించిన శిల్ప సంపదతోపాటు ఆలయ విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకులు మురళీస్వామి ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాచీన శిల్ప సంపదను పరిరక్షించుకోనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, కమిటీ సభ్యుడు సంజన్న, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం అందిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఫయాజ్‌బాషా ట్రస్టు ఆధ్వర్యంలో టీబీ రోగులకు ఉచితంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్టు చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత ఫయాజ్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదలకు చేతనైన సాయం చేసి మానవ జన్మను సార్థకం చేసుకుందామన్నారు. పౌష్టికాహార లోపం, అవగాహనారాహిత్యంతో ఎంతో మంది టీబీ బాధితులు మృత్యువాత పడుతున్నారన్నారు. అలాంటి మరణాలను అరికట్టేందుకు ఉడతా భక్తిగా ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రామలక్ష్మి, డాక్టర్లు సుధాకర్, సునీల్, డేనియల్, యస్దాన్, కౌన్సిలర్లు రియాజ్, వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, డి.వి.కుమార్, ఆలూరు ప్రసాద్ రెడ్డి, వరదయ్య, బాబు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మిల్లుస్కూల్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందడానికి టెన్త్‌క్లాస్ పాస్ విద్యార్థులు జూన్ 6లోగా ఆన్‌లైన్(ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్)లో దరఖాస్తు చేసుకోవాలని టి.నరేంద్రనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో డ్రాఫ్ట్స్‌మాన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మెటార్ వెహికల్, మెకానిక్ డీజిల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులున్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

యల్లనూరు: చిలమకూరు ఆదర్శ పాఠశాలలో టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ వెంకటపతి శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భద్రావతి, భావనారుషీశ్వరులకు ప్రత్యేక పూజలు


స్వాములకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని మార్కండేయస్వామి ఆలయంలోని భద్రావతి భావనారుషీశ్వర స్వాములకు శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రావతి భావనా రుషీశ్వరుల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం అమ్మవారు, స్వామికి విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భద్రావతి భావనా రుషీశ్వర స్వాముల కల్యాణ అత్యంత వైభవంగా జరిగింది. రాత్రి అమ్మవారు, స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బహుత్తమ పద్మశాలియ సంఘం గౌరవాధ్యక్షుడు జలదుర్గం దామార్ దాస్, గౌరవ సలహాదారు వద్ది లక్ష్మీనరసయ్య, ధర్మకర్త చెన్నా సూర్యనారాయణ, అధ్యక్షుడు గడ్డం గణేష్, వైస్ ప్రెసిడెంట్స్ రంగప్రసాద్, రవికుమార్, జాయింట్ సెక్రటరీ గడ్డం పరమేశ్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుత్తి: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు జగన్నాథం, కరీముల్లా పేర్కొన్నారు. పట్టణంలోని లచ్చానపల్లి రోడ్డులో అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోండి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం మొదటి, రెండవ విడతల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భవాని సూచించారు. శుక్రవారం 28వ వార్డులోని సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, ఇతర కారణాల చేత అర్ధంతరంగా నిలిపివేసిన నిర్మాణాలను తిరిగి ప్రారంభించి వెంటనే పూర్తి చేసుకోవాలని ఆమె సూచించారు. జగనన్న లేఔట్లల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించిందన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను సకాలంలో సరఫరా చేస్తుందని, బిల్లులను కూడా ఎప్పటికప్పుడు చెల్లిస్తుందని వెల్లడించారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న హౌసింగ్ లబ్ధిదారులకు మెప్మా ద్వారా మూడు విడతల్లో రూ.45 వేల దాకా రుణాలిప్పించనున్నామని చైర్ పర్సన్ పేర్కొన్నారు. సమావేశంలో మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఓ వనజ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం


నర్సులకు డ్రెస్ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు మెరుగైన సేవలందించి వారి ప్రాణాలను కాపాడిన నర్సులు దేవుళ్లతో సమానమని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు త్రిస్లాబన్సాలీ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మాతృమూర్తుల్లా సేవలందిస్తున్న నర్సులను అభినందించారు. నర్సులు, సిబ్బందికి డ్యూటీ డ్రెస్ మెటీరియల్‌ను ఇన్నర్‌వీల్ క్లబ్ వారు అందజేశారు. వైద్యులు, క్లబ్ సభ్యులు రేణుశ్రీ, శాంత తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ ఎల్లప్ప, ఆర్‌వీఎస్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సృష్టిలో ఎవరైనా తల్లి కడుపు నుంచి మొదట నర్సు చేతిలోకి బిడ్డ వస్తుందన్నారు. ఆర్‌వీఎస్ సభ్యులు కోటేశ్వరావు, కాశీరావు, వైద్యులు రాముడు, సురేఖ నర్సులు నాగమణి, జోత్స్న, తస్లీమ్, సురేఖ, శశికళ, అనిత, శ్యామల, విమల, మహమ్మదీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని 33–11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ రంగస్వామి శుక్రవారం తెలిపారు. గుంతకల్లు మండలంతో పాటు, మున్సిపాలిటీ పరిధిలోనూ విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాటుసారా కేసుల్లో పీడీయాక్టు అమలు


మాట్లాడుతున్న సెబ్ సీఐ వరలక్ష్మి

గుత్తి: ఇక నుంచి నాటు సారాను తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని గుత్తి సెబ్ సీఐ వరలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని సెబ్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సెబ్ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయం, రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దెతండాకు చెందిన భామ్లానాయక్ అలియాస్ పాములా నాయక్ గుత్తి సెబ్ పరిధిలో నాటుసారా రవాణాతో పాటు నాలుగు నాటుసారా కేసుల్లో నిందితుడైనందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ అమలు చేశామన్నారు. చట్ట ప్రకారం పీడీ యాక్ట్ నమోదు చేశామని, అక్రమంగా చేశారని ఆరోపించడం తగదన్నారు. నాటు సారా వల్ల అమాయక ప్రజల జీవితాలు బుగ్గిపాలవుతాయని, ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందనే కారణంతోనే చట్ట ప్రకారం నాటుసారా విక్రేతలపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. సెబ్ ఎస్ఐ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ‘ప్రజావేదిక’


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2022–2023 ఆర్థిక సంత్సరాల్లో ఉపాధి హామీ పనులు, పంచాయతీరాజ్ పనులు, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణం, అటవీ శాఖ పనులపై ఈనెల 1 నుంచి 11 తేదీ వరకు గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారు. అన్ని రకాల పనులకు రూ.8,53,61,116 కోట్లు ఖర్చయినట్లు నిర్ధారించారు. ఈసందర్భంగా డీఆర్పీలు పనుల్లో జరిగిన అవకతవకలు తెలియజేశారు. ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.22,959, పంచాయతీ రాజ్ పనుల్లో రూ18,663, అవెన్యూ ప్లాంటేషన్‌లో రూ.93,762 అక్రమాలు జరిగినట్లు తెలియజేశారు. దీంతో ఉన్నతాధికారులు రూ.4 వేలు రికవరీకి ఆదేశించారు. చనిపోయిన మొక్కలు స్థానంలో కొత్తగా నాటాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి, డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, అంబుడ్స్‌మ్యాన్ మధుసూదన్, ఎంపీపీ వెంకటనారాయణ, ఎంపీడీఓ విజయభాస్కర్, ఏపీఓ నాంచారమ్మ, ఎస్ఆర్పీ లోకేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వైవీఆర్ ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్ కుమారుడి వివాహానికి శుక్రవారం హాజరైన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన విజయ్ కుమార్ రెండేళ్ల క్రితం కరోనాతో మృతిచెందాడు. ఈక్రమంలో విజయ్‌కుమార్ కుమారుడు గాదిలింగ వివాహం శుక్రవారం బుగ్గ సంగమేశ్వర ఆలయంలో జరిగింది. వివాహానికి హాజరైన ఎమ్మెల్యే విజయ్ కుమార్ కుటుంబ సభ్యులకు రూ.20 నగదు అందజేశారు.

నాణ్యమైన వేరుశనగ పంపిణీ చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: రైతులకు ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయాలని ఎంపీపీ సునీత వ్యవసాయాధికారులను కోరారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండన్న అధ్యక్షతన సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎంపీపీతోపాటు ఏడీఏ వెంకటరాముడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలన్నారు. పంటల సాగు, తెగుళ్ల నివారణపై అధికారులు ఎప్పటికప్పుడు సలహాలు సూచలన ఇవ్వాలన్నారు. మండలానికి కే6 2,300 క్వింటాలు, 1812 కదిరి లేపాక్షి రకం 50 క్వింటాళ్లు కేటాయించినట్లు ఏడీఏ తెలిపారు. 40శాతం సబ్సిడీతో వేరుశగన విత్తనాలను అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సచివాలయాల్లో సోమవారం నుంచి వేరుశెనగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారిణి శైలజ, వెటర్నరీ ఏడీ రత్నకుమార్, ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్, మైక్రో ఇరిగేషన్ అధికారి హరిత, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడండి


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న డీఆర్ఓ గాయత్రీ దేవి

యాడికి: డోలమైట్ క్వారీల నిర్వాహకులు ప్రజలు, రైతులకు ఇబ్బంది కలిగించకుండా పనులు చేయించుకోవాలని డీఆర్వో గాయత్రిదేవి సూచించారు. శుక్రవారం నగరూరు గ్రామ పరిధిలోని సర్వే నం:505ఎలో 2.52 ఎకరాలు, సర్వే నం:505బిలో 2.28 ఎకరాల్లో గల 1.889 హెక్టార్ల డోలమైట్, స్టీటైట్ తవ్వకానికి సంబంధించి శ్రీ చైతన్య మినరల్ మెనింగ్ కోసం నగరూరు పంచాయతీలో పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లె వద్ద పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ డీఆర్ఓ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ మైనింగ్ వల్ల దుమ్ము రేగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రోడ్లపై రోజూ నీరు చల్లించాలని క్వారీ నిర్వాహకురాలు ఎం చంద్రకళావతికి సూచించారు. క్వారీలకు సమీపంలోని భోగాలకట్ట, వెంగన్నపల్లె, పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లె అభివృద్ధితో పాటు ఆయా గ్రామాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. పనులు చేసేటప్పుడు భద్రతా చర్యలతో పాటు నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే క్వారీలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. క్వారీల నుంచి వచ్చే దుమ్ము,ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నట్లు డీఆర్వో ముందు వాపోయారు. తహసీల్దార్ అలెగ్జాండర్, సర్పంచు రుక్మాందరెడ్డి, ఆర్ఐ ఆనందబాబు ఆచారి, వీఆర్వోలు రమేష్, నరసింహులు పాల్గొన్నారు.

డ్రైనేజీపై కట్టడాల తొలగింపు

పామిడి: పట్టణంలోని బైపాస్ పక్కన డ్రైనేజీపై నిర్మించిన కట్టడాలను ఈఓఆర్డీ బీవీ శశికళ ఆధ్వర్యంలో జేసీబీతో తొలగింపజేశారు. అక్రమ కట్టడాలతో డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి మురుగునీరు ముందుకు వెళ్లడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన ఈఓఆర్డీ కట్టడాలను తొలగించి మురుగునీరు ముందుకు పోయేలా చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, స్థానికులు పాల్గొన్నారు.

అడంగల్‌లో పేర్లు తొలగించండి

శింగనమల: సీ.బండమీదపల్లిలోని వెంకటేశ్వర స్వామి మాన్యం సర్వే నంబర్ 367లో 11.16 ఎకరాల భూమికి సంబంధించిన అడంగల్‌లో నమోదు చేసిన పేర్లను తొలగించాలని తహసీల్దార్ ఈశ్వరమ్మకు దేవదాయ ఈఓ శోభ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో దేవదాయ పొలాన్ని కౌలుకు తీసుకున్న వారి కౌలు తీరిపోయినా పేర్లు మాత్రం కొనసాగుతున్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గార్లదిన్నె: పాపినేపాళ్యం గుట్టలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడులు చేసి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. నిందితులనుంచి రూ.9773 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బుక్కరాయసముద్రం: కేకే అగ్రహారంలో శుక్రవారం నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుల నుంచి 3 బైక్‌లు, 2 సెల్‌ఫోన్లు, రూ.5,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: కొజ్జేపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కొజ్జేపల్లి గ్రామానికి చెందిన పాపన్న వ్యక్తిగత పనిపై రజాపురం గ్రామానికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని స్వగ్రామానికి బయలుదేరాడు. గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాపన్నను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి, బసినేపల్లి గ్రామాల్లో కుక్కలు దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. లచ్చానుపల్లికి చెందిన గోపాల్, బసినేపల్లికి చెందిన వెంకటరాముడులు గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా వారిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వారిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. మండల వ్యాప్తంగా కుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

14న రాతిదూలం లాగుడు పోటీలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా వట్టకొట్టిన దేవపు ఎద్దులకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ముత్యాల్‌రెడ్డి తెలిపారు. మండల స్థాయిలోని ఎద్దులకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. 13న ఉదయం 7 గంటలకు టోకెన్లు ఇస్తామని, ఆసక్తి గల వారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నేడు రాష్ట్రస్థాయి తాళాల భజన పోటీలు

గార్లదిన్నె: ముకుందాపురంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి తాళాల భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి ఆంజనేయస్వామి భజన మండలి, గ్రామ పెద్దలు సమక్షంలో పోటీలు ప్రారంభిస్తామన్నారు. విజేతలైన 21 బృందాలకు నగదు బహుమతులు అందిస్తామని, వివరాలకు 7780341202, 9573437160 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

శింగనమల: మండలంలోని వెస్ట్ నరసాపురం సమీపంలోని పొలంలో అక్రమంగా నిల్వ చేసిన 84 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించి బెంగుళూరుకు తరలించడానికి సిద్ధంగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కృష్ణమూర్తి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ జయపాల్, సీఎస్‌డీటీ రాజశేఖర్ పాల్గొన్నారు. రేషన్ బియ్యాన్ని శింగనమల సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు సీఎస్‌డీటీ రాజశేఖర్ తెలిపారు.

రైతులు చిరు ధాన్యాలు సాగు చేయాలి

యాడికి: చిరుధాన్యాలైన జొన్నలు, రాగులు, సద్దలు, కొర్రలు సాగు చేసుకుంటే రైతు వద్దకే ప్రభుత్వం వచ్చి కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చంద్రానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఎరువులను మోతాదుకు మించి వాడరాదని, పంటల సాగులో మండల వ్యవసాయ అధికారితో పలు సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు సాగు చేసిన పంట నమోదును వ్యవసాయ సిబ్బంది జాగ్రత్తగా చేయాలన్నారు. ఏడీఏ నారాయణ నాయక్, ఏఓ మహబూబ్‌బాషా, ఏఈఓ రజిత పాల్గొన్నారు.